సాక్షి కర్నూలు

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



మద్దమాంబకు వెండి కిరీటం

మద్దికెర: మద్దమాంబ అమ్మవారికి రూ.3 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని సోమవారం మద్దికెర గ్రామానికి చెందిన కళ్యాణ్‌రాం, భరత్‌రాజ్ అందజేశారు.



ఊరికి దేవుడొచ్చె!

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీనరసింహ స్వామి పార్వేట పల్లకీ సోమవారం ఎస్.లింగందిన్నెకు చేరుకుంది. భక్తులు ఉత్సవ మూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,614.45
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:47.129
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,658

న్యూస్‌రీల్

15న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఈ సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి– శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక.. తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా స్థాయీ సంఘాల చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు వారికి కేటాయించిన సమయాల్లో హాజరు కావాలని సూచించారు.

ఈబీసీ నేస్తానికి 23,422 దరఖాస్తులు

కర్నూలు(అర్బన్): ఈబీసీ నేస్తం పథకానికి ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23,422 దరఖాస్తులు వచ్చినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కార్యాలయాల నుంచి ఈ దరఖాస్తులను తమ కార్యాలయానికి అప్‌లోడ్ చేశారన్నారు. 45 సంవత్సరాలు పైబడి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు నెలసరి ఆదాయం ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పథకం కింద గతేడాది జనవరి 25వ తేదీన మొదటి విడతగా ఉమ్మడి జిల్లాలో 6,245 మంది మహిళల ఖాతాల్లోకి ఒక్కొక్కరికి రూ.15 వేల ప్రకారం రూ.9,36,75,000 జమ అయ్యాయన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 7,536, నంద్యాల జిల్లాలో 15,886 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో ఫ్రెష్, రెన్యూవల్స్ ఉన్నారని ఈడీ వివరించారు.

7,655 మందికి హెపటైటిస్‌-బీ టీకా



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7,655 మంది హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్‌-బి వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. సోమవారం కర్నూలు పెద్దాసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఎయిడ్స్ ప్రాజెక్టు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ కె. రాజాకుమార్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ ఆర్. రాధిక పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు



కర్నూలు సిటీ: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు ఆర్జేడీ ఎస్ రవి ఆదేశించారు. సోమవారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి కార్యాలయంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, హైపవర్ కమిటీ, త్రీమెన్ కమిటీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 10వ తేదీలోపు ఏర్పాట్లను తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు తాగు నీటి సదుపాయంతో పాటు ల్యాబ్‌లలో విద్యుత్ వెలుగు ఎక్కువగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ఇంటర్ బోర్డు ఆర్ఐఓ గురవయ్యశెట్టి, జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా, నంద్యాల డీవీఈఓ పి.వి రామన్, మాజీ ఆర్ఐఓ పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యం.. ఆరోగ్యభాగ్యం!



మేజర్ మిల్లెట్స్: జొన్న, సజ్జ / మైనర్ మిల్లెట్స్: కొర్రలు, రాగులు, ఊదలు, ఆరికలు, అండుకొర్రలు, సామలు



అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరిగిపోయింది. ఇలా సాగు చేసిన ఆహార పంటల్లో రసాయనాల అవశేషాలు ఉన్నట్లు శాస్త్రీయంగానూ నిరూపితమైంది. ఇదే సమయంలో చక్కెర వ్యాధి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వరి, గోధుమల వినియోగం పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వీటితో పాటు ఇతర వ్యాధులు చుట్టుముడుతుండటంతో ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఇష్టపడుతుండటంతో ధర కూడా అదేస్థాయిలో ఉంటోంది. ఇక ఐక్యరాజ్య సమితి కూడా2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించడం విశేషం.

జిల్లాలో కొర్ర సాగుకు ప్రాధాన్యం

- చిరుధాన్యాల సాగుకు ఐదేళ్ల ప్రణాళిక సిద్ధం
- ఏడాది పొడవునా అవగాహన కార్యక్రమాలు
- హెక్టారుకు రూ.6వేల విలువ ఇన్‌పుట్స్
- ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రూ.1.25 లక్షల సబ్సిడీ
- కనీస మద్దతు ధర రూ.2,500

37 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు



కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో భూమి కౌలుకు తీసుకొని నాలుగేళ్ల నుంచి చిరుధాన్యాల పంటలనే ప్రధానంగా సాగు చేస్తున్నా. మొదటి ఏడాది 7 ఎకరాల్లో సాగు చేశాం. 2023ను అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది 15 ఎకరాల్లో ఊదలు, 15 ఎకరాల్లో సామలు, 7 ఎకరాలు ఆరికలు సాగు చేస్తున్నాం. ఎంపిక చేసిన రైతులతో కొర్రలు, అండుకొర్రలు సాగు చేయిస్తున్నా. సొంతంగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేసుకుంటున్నాం.

– వేణుబాబు, మిల్లెట్స్ రైతు, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాలు ఒకప్పుడు పేదలు, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం. మూడు దశాబ్దాల క్రితం వరకు వీటి వినియోగం అధికంగా ఉండేది. ఈ పంటలను వంద శాతం పశువుల ఎరువులు, చెరువు మట్టి, ఇతర సేంద్రియ ఎరువులతోనే పండించేవాళ్లు. ఫలితంగా ప్రజల్లో రోగనిరోధక శక్తి కూడా ఎక్కువ. తదనంతరం వచ్చిన మార్పుల్లో ఏడాదికేడాది చిరుధాన్యాల సాగు తగ్గుతూ వచ్చింది. వరి, పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న సాగు భారీగా పెరిగింది. ఇదే సమయంలో వ్యాధుల తీవ్రత కూడా అధికమైన పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. రాష్ట్రంలో ఈ పంటల సాగు, వినియోగాన్ని ఉద్యమ తరహాలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ శాఖ ఏడాది పొడవునా అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. నంద్యాల ఆర్ఏఆర్ఎస్, యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాలలో మిల్లెట్స్‌లో స్వల్పకాలిక రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

హెక్టారుకు రూ.6వేల విలువ ఇన్‌పుట్స్ సరఫరా

చిరుధాన్యాలను రసాయన ఎరువుల అవసరం లేకుండా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చు. జనవరి నెలలో చిరుధాన్యాల సాగుపైన సబ్ డివిజన్‌ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో 5,650 హెక్టార్లలోకొర్ర సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2022–23 నుంచి 2026–27 వరకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఇందుకోసం హెక్టారుకు రూ.6వేల విలువ చేసే ఇన్‌పుట్స్ సరఫరా చేస్తారు. 100 హెక్టార్ల ప్రకారం చిరుధాన్యాల పంటల ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నారు. చిరుధాన్యాల పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను కూడా ప్రకటించింది. వీటికి మార్కెట్‌లో ధరలు తగ్గిపోతే ప్రభుత్వం మద్దతు ధర రూ.2,500 ప్రకారం కొనుగోలు చేయనుంది. చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో మినీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయనుంది. వీటికి రూ.1.25 లక్షల సబ్సిడీ ఉంటుంది.

పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు

- 250 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు.
- విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు.
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం కింద చిరుధాన్యాల ఆహారం.
- ఏడాది పొడవునా క్యాలెండర్ ప్రకారం కార్యక్రమాల నిర్వహణ.
- పట్టణం నుంచి గ్రామీణ స్థాయి వరకు రోడ్ షోలు.

ఐదేళ్ల మిల్లెట్స్ ప్రణాళిక ఇలా..	
సంవత్సరం	సాగు లక్ష్యం (హెక్టార్లలో)
2022-23	419
2023-24	631
2024-25	1074
2025-26	1680
2026-27	1846
మొత్తం	5650

సోనా మసూరి బియ్యం ధర (కిలో): రూ.50

చిరు ధాన్యం కిలో ధర (రూపాయల్లో)	
సామలు	125
ఉదర	165
అండుకొర్ర	165
అరికలు	110

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం



తక్కువ నీరు, పెట్టుబడితో చిరుధాన్యాలను సాగు చేయవచ్చు. అందువల్ల మిల్లెట్స్ సాగును ప్రోత్సహించడంతో పాటు వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో కొర్ర సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతులకు రూ.6వేల విలువ ఇన్‌పుట్స్ అందిస్తాం.

– బిల్లం మహేశ్వరరెడ్డి, చైర్మన్, డీసీఏబీ

జిల్లాలో అనువైన పరిస్థితులు



మిల్లెట్స్ సాగును ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లాలో చిరుధాన్యాల సాగుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే సబ్ డివిజన్ వారీగా ఆర్‌బీకే స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. 250 ఎకరాల్లో చిరుధాన్యాల పంటల ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

ఆర్‌యూలో అడ్డగోలు నియామకాలు!

- నాన్ టీచింగ్ ఉద్యోగుల నియామకాల్లో నిబంధనల ఉల్లంఘన
- అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని పది నెలల క్రితం సీఐడీకి ఫిర్యాదు
- వివరాలు ఇవ్వాలని కోరిన సీఐడీ
- స్పందించని ఆర్‌యూ అధికారులు
- మరో సారి రిజిస్ట్రార్‌కు నోటీసులు



రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చారు. అడ్డగోలుగా నియామకాలు చేపట్టారు. ఎలాంటి ప్రకటన లేకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారు. ఈ వ్యవహారంలో భారీగా మామూళ్లు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాలపై సీఐడీ పోలీసులకు పది నెలల క్రితం ఫిర్యాదు అందింది. దీనిపై వివరాలు ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్‌కు సీఐడీ డీఎస్పీ నాలుగు సార్లు లేఖలు రాశారు. అయితే వర్సిటీలో పనిచేస్తున్న 102 మంది నాన్ టీచింగ్ ఉద్యోగుల విద్యార్హతలకు సంబంధించి వివరాలను పాఠశాల విద్యాశాఖ తమకు అందజేయలేదని, దీంతో సీఐడీకి వివరాలు ఇవ్వలేకపోయామని వర్సిటీ రిజిస్ట్రార్ చెబుతూ వచ్చారు. వివరాలు ఇవ్వడంలో జాప్యం జరగడంతో మరోసారి 20 రోజుల క్రితం 91 సీఆర్‌పీసీ కింద రిజిస్ట్రార్‌కు సీఐడీ అధికారులు నోటీసు జారీ చేశారు. నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని లేకపోతే లీగల్‌గా ప్రొసీడ్ కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. గడువు దాటినా వర్సిటీ అధికారుల నుంచి ఎలాంటి సమాధానం వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసేందుకు సీఐడీ అధికారులు యత్నిస్తున్నట్లు సమాచారం.

విచారణ పూర్తయ్యేంత వరకు జీతాలు లేనట్లే!

రాయలసీమ యూనివర్సిటీ 2008లో ఏర్పాటైంది. అప్పట్లో నాన్ టీచింగ్ ఉద్యోగుల నియామకాలకు జీఓ ఎంఎస్ నంబర్ 50ని జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నాలుగు రెగ్యులర్, 23 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసుకోవాలి. కానీ యూనివర్సిటీ అధికారులు పలు దఫాలుగా ఎలాంటి ప్రకటన లేకుండా నియామకాల ప్రక్రియ చేపట్టారు. వీటిలో అత్యధిక శాతం పోస్టులకు ఆర్థిక శాఖ ఆమోదం కూడా లేనట్లు తెలుస్తోంది. మినిమం టైం స్కేల్ అమలులో కూడా అక్రమాలు చోటు చేసుకున్నట్లు సీఐడీ అధికారులకు అందిన ఫిర్యాదులో ఉన్నట్లు తెలుస్తోంది. వర్సిటీ అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో సీఐడీ పోలీసులు ఖజానా శాఖను సైతం సంప్రదించడంతో గతేడాది చివరిలో జీతాలు నిలిపి వేశారు. తాజాగా గత నెల 24వ తేదీన జరిగిన వర్సిటీ ఈసీ సమావేశంలోను నాన్ టీచింగ్ ఉద్యోగులపై విచారణ పూర్తయ్యేంత వరకు వేతనాలు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. సీఐడీ విచారణకు వర్సిటీ అధికారులు సహకరించే దానిపై నాన్‌టీచింగ్ ఉద్యోగుల వేతనాల అంశం ఆధారపడి ఉంది.

ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారాలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ప్రజలు సంతృప్తి చెందేలా స్పందన అర్జీలకు పరిష్కారాలు చూపాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు సచివాయలయ ఉద్యోగులకు అవకాశం ఉందన్నారు. అక్కడే వీలైనంత వరకు దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద 1902 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

డిజిటల్ పేమెంట్ సేవలు

ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ఫిష్ ఆంధ్ర మినీ అవుట్ లెట్ యజమానులకు పేటీఎం, పీఓఎస్ డిజిటల్ మిషన్లను కలెక్టర్ అందజేశారు.



ప్రజల వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు

కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

ఇసుక, సిమెంట్ కొరత లేకుండా చూడాలి

జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు సిమెంట్, ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్పందన'కు వచ్చిన వినతుల్లో కొన్ని..

- సర్వే నంబర్ 504లో 0.31 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలని కర్నూలు మండలం రుద్రవారినికి చెందిన బాలమ్మ కోరారు.
- మీదివేములలో 2.50 ఎకరాల భూమి ఉందని, అందులో 1.50 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైందని, మిగిలిన ఎకరా పొలాన్ని కూడా అందులో చేర్చాలని ఎల్.నాగమయ్య వినతిపత్రం సమర్పించారు.
- తన భర్త ఉరుకుందు నవంబర్‌లో మృతి చెందాడని, వితంతు పెన్షన్‌ను మంజూరు చేయాలని గోనెగండ్ల మండలం నెరుడుప్పలకు చెందిన సి.మల్లమ్మ కోరారు.
- తన వదిన నకిలీ డ్యాకుమెంట్లు సృష్టించుకొని 3.37 ఎకరాల భూమిని తన పేరున రాయించుకుందని, దానిని రద్దు చేయాలని కర్నూలు మండలం పంచలింగాలకు చెందిన లాజరు, కిష్టధర్ ఫిర్యాదు చేశారు.
- సర్వే నంబర్ 64 పరిధిలోని ఇసుక తవ్వకాలు చేస్తుండడంతో 400 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్ లైన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని వెలమకూరుకు చెందిన సుభాన్ వినతి పత్రం అందించారు.

అన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం పలువురు దాతలు విరాళాలు అందించారు. వీరిలో మంచిర్యాలకు చెందిన ఎ.శివకుమార్ రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన సి.వెంకటేశ్వరరెడ్డి రూ.లక్ష, నంద్యాలకు చెందిన ఎస్. రాజేష్ రూ.1,01,116, కేరళకు చెందిన కమల సింధూ చాగంటి రూ.లక్ష విరాళంగా అందజేశారు.

ఎద్దులు అ'ధర'హో

కోడుమూరు రూరల్: చూడముచ్చటైన ఒంగోలు జాతి ఎద్దులు.. రంగంలోకి దిగాయంటే విజయం రంకేయాల్సిందే. ఇప్పటి వరకు 12 పోటీలు.. ప్రతి చోటా ప్రథమ బహుమతే.. ఇవి బండను లాగుతుంటే చూసేందుకు రెండు కళ్లు చాలవు..వీటి ఖరీదు కూడా ఎక్కువే. చౌడేశ్వరీ దేవి తిరుణాల సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీల కోసం సోమవారం కోడుమూరు పట్టణానికి వచ్చాయి. ఖరీదైన ఎద్దులను చూసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా ఎద్దుల యజమాని నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి మాట్లాడుతూ.. బాపట్లలో రూ.55 లక్షలు వెచ్చించి వీటిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతపురం, కర్నూలు,గుంటూరు జిల్లాలో, తెలంగాణ రాష్ట్రంలో 12 చోట్ల జరిగిన బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాయన్నారు. వీటిని రూ.75లక్షలతో కొనేందుకు చాలామంది ముందుకొస్తున్నా అమ్మడం లేదని తెలిపారు. వీటికి ఉలువలు, బీన్స్, ఖర్జూరాలు, దాణా, మేత పెట్టేందుకు నెలకు రూ.30వేలు దాకా ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.



ఎద్దులతో యజమాని బోరెడ్డి కేశవరెడ్డి



రాయలసీమ యూనివర్సిటీ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



జూనియర్స్ విభాగంలో విన్నర్స్ ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల జట్టు

విజేతలు ఆర్‌యూ, నంద్యాల పాలిటెక్నిక్ కాలేజీ

సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. సీనియర్స్ విభాగంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు , జూనియర్స్ విభాగంలో నంద్యాల ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజేతలుగా నిలిచాయి. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అందజేశారు. - వివరాలు 8లో

డ్రోన్ల కొనుగోలుకు ఎస్‌బీఐ రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ రంగానికి సంబంధించి డ్రోన్ల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కర్నూలు రీజినల్ మేనేజర్ లేఖమీనన్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో రీజినల్ మేనేజర్ విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గోపీకృష్ణ అనే రైతుకు డ్రోన్ కొనుగోలు కోసం ఎస్‌బీఐ చైర్మన్ దినేష్‌ఖారా చేతుల రూ.10 లక్షల రుణం మంజూరు పత్రాలు అందజేసినట్లు చెప్పారు.

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

- ముగిసిన సాక్షి ప్రీమియర్ జిల్లాస్థాయి క్రికెట్ లీగ్ పోటీలు
- విజేతలుగా నిలిచిన రాయలసీమ యూనివర్సిటీ, నంద్యాల పాలిటెక్నిక్ కాలేజీ జట్లు
- విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



సీనియర్స్ విభాగంలో రన్నర్స్ ట్రోఫీని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ చేతుల మీదుగా అందుకుంటున్న పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు



జూనియర్స్ విభాగంలో రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న కోడుమూరు కేవీఆర్ కళాశాల జట్టు

కర్నూలు (టౌన్): క్రీడలను సాక్షి మీడియా ప్రోత్సహించడం అభినందనీయమని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల నిర్వహణకు జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యం స్పాన్సర్‌గా వ్యవహరించింది. కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో ఐదు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు , జూనియర్స్ విభాగంలో నంద్యాల ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజేతలుగా నిలిచాయి. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సాక్షి మీడియాను అభినందిస్తున్నానన్నారు. విజేతలుగా నిలిచిన జట్లు రీజినల్ స్థాయి మ్యాచ్‌ల్లోనూ ఇదే ప్రతిభ చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌రావు, సాక్షి బ్యూరో రవివర్మ పాల్గొన్నారు.

SAKSHI PREMIER LEAGUE

డిస్ట్రిక్ట్ స్పాన్సర్

GPCET Pioneering Innovative Education

'ఈఎస్‌సీ' విజయం

జూనియర్స్ విభాగంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ నెగ్గి నంద్యాల ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. జట్టులో బ్యాట్స్‌మెన్ అనిల్ అత్యధికంగా 52 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కోడుమూరు కేవీఆర్ జూనియర్ కళాశాల జట్టు తడబడుతూ బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 66 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

'ఆర్‌యూ' జయకేతనం

సీనియర్స్ విభాగంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసింది. జట్టులో బ్యాట్స్‌మెన్ రాహుల్ రెండు సిక్స్‌లు, ఐదు ఫోర్లతో 43 పరుగులు చేశాడు. అలాగే జావెద్ 4 ఫోర్లతో 18 పరుగులు చేసి స్కోరును పరుగులు పెట్టించారు. అనంతరం బరిలోకి దిగిన జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి ఓటమి చెందింది.

SAKSHI MEDIA GROUP www.sakshi.com



ఫైనల్ పోటీలో సిక్స్ కొడుతున్న క్రీడాకారుడు



విజయానందంలో రాయలసీమ వర్సిటీ జట్టు

క్లుప్తంగా

సర్పంచుల గౌరవ వేతనాల విడుదలకు చర్యలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 482 మంది గ్రామ పంచాయతీ సర్పంచులకు గౌరవ వేతనాలను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజు నాయుడు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి గౌరవ వేతనాలు చెల్లించేందుకు రూ.1,58,52,836 రాగా, ఇందులో గత ఏడాది జూలై నెలలో రెండు క్వార్టర్లకు సంబంధించి రూ.79,26,418 చెల్లించామన్నారు. మిగిలిన క్వార్టర్లకు గాను రూ.79,26,418 చెల్లించేందుకు వీలుగా బిల్లులను ట్రెజరీకి పంపుతున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వృత్తి పన్ను కింద రూ.1,07,18,524 విడుదల చేయగా, గత ఏడాది నవంబర్ నెలలో రూ.80,38,893 ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన రూ.26 లక్షలను ప్రస్తుతం విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తలసరి గ్రాంట్ కింద రూ.61,57,276 ప్రభుత్వం విడుదల చేయగా, ఇందులో ఇప్పటికే 46,17,957 ఆయా గ్రామ పంచాయతీల జనాభాను అనుసరించి సర్దుబాటు చేశామన్నారు. మిగిలిన రూ.15,39,319 తిరిగి ఆయా గ్రామ పంచాయతీలకు సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు డీపీఓ చెప్పారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేసిన వివరాలతో పాటు గర్భిణుల వివరాలనూ తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం నగరంలోని శరీన్‌నగర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, ల్యాబ్ రిజిస్టర్, మందుల స్టాక్ రిజిష్టర్‌లను ఆయన పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సమీక్షించారు. ఆయన వెంట వైద్యాధికారిణి డాక్టర్ ఫర్వీన్ తబస్సుం, సిబ్బంది ఉన్నారు.

శ్రీ మఠానికి రూ.3లక్షల విరాళాలు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి రూ. 3 లక్షలు విరాళంగా వచ్చినట్లు మేనేజర్ ఎస్.కే.శ్రీనివాసరావు తెలిపారు. బెంగళూరుకు చెందిన వసుదేవరావు గోసంరక్షణ కోసం రూ. లక్ష, అన్నదానం కోసం నాగరాజురావు రూ. 2 లక్షలు వేర్వేరుగా అందజేసినట్లు చెప్పారు. దాతలకు శ్రీ మఠం అధికారులు శ్రీ రాఘవేంద్రస్వామి మెమొంటో, పరిమళ ప్రసాదం అందజేశారు.

10న ఉల్లిపై జాతీయస్థాయి వర్క్‌షాపు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిపై జాతీయస్థాయి వర్క్‌షాపును ఈ నెల 10వ తేదీన కర్నూలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. ఉద్యాన శాఖ– ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి సొసైటీ(ఏపీ ఎంఎఎస్) సంయుక్తంగా నేషనల్ లెవల్ వర్క్‌షాపు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీ మహిళాఅభివృద్ధి సొసైటీ ఉల్లి రైతులతో ఆరు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. జాతీయస్థాయి వర్క్‌షాపునకు ఈ సొసైటీ ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో పాటు ఇతర రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులు పాల్గొంటారని తెలిపారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని త్రిగుణ క్లాక్‌లో జరిగే వర్క్‌షాపునకు అన్ని రాష్ట్రాల నుంచి ఉల్లి సాగు చేసే రైతులు కూడా పాల్గొంటారన్నారు. ఉద్యానశాఖ ఉన్నతాధికారులు, ఉల్లి పరిశోధన స్థానాల నుంచి శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

అవుకు: చెర్లోపల్లె గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఆవుల సుధాకర్(45)కు ముగ్గురు కూతుర్లు కాగా వారికి అప్పు చేసి వివాహాలు చేశాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందాడు. దీంతో ఆదివారం రాత్రి రసాయన ద్రావణాన్ని తాగి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబీకులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని చిన్న కుమార్తె సుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



అంజూదేవి (ఫైల్)

ప్యాపిలి: రాచర్ల ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న అంజూదేవి (27) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాచర్ల పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీలో విశ్వజిత్ అనే పూజారి ఏడాదిన్నర కాలం నుంచి వినాయక ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నారు. ఫ్యాక్టరీలోని క్వార్టర్స్‌లో ఆయన భార్య అంజూదేవి, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల నుంచి అంజూదేవి కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

న్యాయవాదిపై దాడి

డోన్ రూరల్: పట్టణంలోని స్థానిక కంబలపాడు సర్కిల్‌లో సోమవారం ఓ న్యాయవాదిపై దాడి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. న్యాయవాది పులి దామోదర్ గతంలో ఆర్‌టీయాక్ట్ కింద డోన్ పట్టణంలో ఉన్న మెడికల్ షాపుల వివరాలు ఇవ్వాలని కోరాడు. ఆ క్రమంలోనే పట్టణంలో మెడికల్ షాపులలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేశారు. పట్టణంలోని స్థానిక కంబాలపాడు సర్కిల్‌లో ఉన్న సుజల్ మెడికల్ షాపులో అధికారులు తనిఖీ చేసి రికార్డులు సరిగా లేవని 15 రోజుల పాటు సీజ్ చేశారు. అయితే తనపై కక్షతోనే న్యాయవాది మెడికల్ షాప్‌ను సీజ్ చేయించారని మెడికల్ స్టోర్ పక్కనే ఆర్‌ఎంపీగా పని చేస్తున్న బాలు భావించాడు. దీంతో సోమవారం న్యాయవాది దామోదర్‌పై బాలు, అతని అనుచరులు కట్టెలు, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

బండిఆత్మకూరు: పెద్దదేవళాపురం గ్రామం వద్ద సోమవారం తెల్లవారు జామున 450 సంచుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ చెన్నకేశవరెడ్డి, విజిలెన్స్ తహసీల్దారు వెంకట నారాయణ మాట్లాడుతూ.. సమాచారం మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని లారీలో లోడ్ చేసి చిత్తూరు జిల్లాకు తరలిస్తున్నట్లు సమాచారం అందగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. లారీ డ్రైవర్లు కోటకొండ ముని ప్రసాద్, మన్యం శ్రీధర్‌ను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాసులు అనే వ్యక్తి పిలుపు మేరకు తమ లారీని బాడుగకు తీసుకువచ్చినట్లు డ్రైవర్లు చెప్పారన్నారు. దీంతో శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నంద్యాల గోదాముకు తరలించామన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- న్యాయం చేయాలని బాధితుల విన్నపం
- పోలీస్ స్పందనకు 101 ఫిర్యాదులు



స్పందనలో పోలీసు అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

కర్నూలు: '' దేవదాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో నాకు బాగా సంబంధాలు ఉన్నాయి. మా శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తాను'' అంటూ నమ్మబలికి నాగరాజు అనే వ్యక్తి రూ.9.8 లక్షల నగదు తీసుకొని మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన అయ్యన్న కోరాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 101 మంది హాజరై తమ సమస్యలను విన్నవించారు. అయ్యన్న స్పందనకు హాజరై తన సమస్యను పోలీస్ అధికారులకు తెలిపాడు. 2019లో నాగరాజు తన నుంచి రూ. 9.8 లక్షల డబ్బులు తీసుకుని ఉద్యోగం ప్పిస్తానని నమ్మించాడన్నారు. ఉద్యోగం ఇప్పించకపోగా ఇప్పటివరకు డబ్బులు కూడా వాపసు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. మోసపూరితంగా ఫ్లాటును తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిపై నిలదీసినందుకు దాడిచేసే యత్నం చేస్తున్నాడని, విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు స్వామిరెడ్డి నగర్‌కు చెందిన లత ఫిర్యాదు చేశారు. రస్తాకు అడ్డంగా రాళ్లు వేయించి రాకపోకలు సాగకుండా ఒక వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆరుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. భర్త హింసిస్తున్నాడని అమడగుంట్లకు చెందిన నాగేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్పీలు కృష్ణకాంత్ పటేల్, డి.ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తి

– తాళ్లతో కట్టేసిన కాలనీవాసులు



ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని లక్ష్మీపేటలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంట్లోకి ప్రవేశించిన ఓ వ్యక్తిని దొంగ అనుకొని కాలనీ వాసులు తాళ్లతో కట్టేశారు. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి బైక్‌పై వచ్చి అర్ధరాత్రి శ్రీనివాస టాకీస్ వెనక ఉన్న లక్ష్మీపేటలోని ఓ ఇంట్లోకి ప్రవేశించాడు. మెలకువ వచ్చిన మహిళ కేకలు వేయటంతో కాలనీ వాసులు ఆ వ్యక్తిని పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఇంట్లోకి ప్రవేశించి తన కాళ్ల కడియాలను పట్టుకున్నాడని, దీంతో మెలకువ వచ్చి తన భర్తకు చెప్పటంతో పట్టుకున్నామని మహిళ చెప్పారు. కుక్కలు వెంటపడటంతో బైక్ వదలి పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లినట్లు వెంకటేష్ చెప్పాడు. వెంకటేష్ వేలిముద్రలు తీసుకొని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

'ఈ-శ్రామ్' గుర్తింపు తప్పనిసరి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి అసంఘటిత కార్మికుడు ఈ–శ్రామ్ గుర్తింపు కార్డు పొందాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఈ–శ్రామ్ కార్డులు ఇస్తోందని, దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం



ప్రసాద్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఆదోని రైల్వేస్టేషన్‌లో పూణే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కె. ప్రసాద్(26) అనే యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. ఎమ్మిగనూరు పట్టణం శాంతినగర్‌లో నివాసముంటున్న జాకోబు, నరసమ్మలకు ముగ్గురు కుమారులు. వీరి పెద్దకుమారుడు కె. ప్రసాద్ ఎంబీఏ వరకు చదివాడు. తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం బెంగళూరుకు వెళ్లారు. అయితే ప్రసాద్ ఎమ్మిగనూరు పట్టణంలో ఉంటూ తాను తల్లిదండ్రుల సంపాదనపై బతుకుతున్నాని ఆవేదన చెందేవాడు. ఆదోనిలో తన అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లివస్తానని స్నేహితులకు చెప్పి వెళ్లాడు. జీవితంలో ఏమీ సాధించలేకపోయానని, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోమవారం ఉదయం తన సెల్‌ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం ఆదోని రైల్వేస్టేషన్‌లో పూణే ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుని వివరాలు తెలుసుకున్న రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరుకు తీసుకు వస్తున్నట్లు బంధువులు తెలిపారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం(రూ)	గరిష్టం (రూ)
వేరుశెనగ	5590	8211
పొద్దుతిరుగుడు	3519	5109
ఆముదం	6189	6519
వాము	4799	23234
ఉల్లి	639	1039
ఎండు మిర్చి	5699	28179
శనగలు	4401	4619
కందులు	2121	7169
మినుములు	6781	6918



మునగ సాగు.. ప్రోత్సాహకాలు బాగు

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వంద శాతం సబ్సిడీ
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో వెయ్యి ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు
- ప్రతి మండలంలో నర్సరీల ఏర్పాటు
- జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు మునగ సాగుకు అర్హులు




కర్నూలు మండలం గార్గేయపురంలో ఉపాధి నిధులతో సాగైన మునగ

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు లాభాలు వచ్చే విధంగా మునగ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వంద శాతం సబ్సిడీ ఇస్తోంది. జిల్లాలో మొదటిసారిగా ఈ ఏడాది ఉపాధి నిధులతో 105 ఎకరాల్లో మునగ సాగు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అన్ని ప్రాంతాల్లో సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు ఉన్నారు. వెయ్యి ఎకరాల్లో సాగు చేపట్టే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతి మండలంలో కనీసం 50 ఎకరాలు సాగు చేయించి, చిన్న రైతుల జీవనోపాధులను అభివృద్ధి చేయనున్నారు. ఒక్కసారి మొక్కలు నాటుకుంటే ఆరేళ్ల వరకు పంట వస్తుంది. మునగలో అనేక రకాల పోషకాలు ఉండడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఉంది.

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి

మునగ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించింది. ప్రతి మండలంలో కనీసం ఐదు వేల మొక్కలతో మునగ నర్సరీలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మునగలో పీకేఎం–1 రకం ఐదు నుంచి ఆరు నెలలలోపే పూతకొచ్చి ఎనిమిది నెలల్లో కోతకు వస్తుంది. మొక్కకు 220 కాయలు వచ్చి, 75 సెంటీమీటర్ల పొడవు ఉండి 150 గ్రాముల బరువు తూగుతాయి. రైతులు కోరుకుంటున్న పీకేఎం–1 రకం మొక్కలతో నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. మునగ సాగుకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. దిగుబడి ఆశాజనకంగా ఉండి, మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో రైతులకు కలిసొచ్చే అవకాశం ఉంది. జాబ్ కార్డు కలిగి ఐదు ఎకరాలలోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులందరూ మునగ సాగుకు అర్హులే. కనిష్ఠంగా పావు ఎకరా నుంచి గరిష్ఠంగా ఎకరా వరకు ఉపాధి నిధులతో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. ఎకరాకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.1.05 లక్షల మొత్తాన్ని దశల వారీగా చెల్లిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఈ ఏడాది చేపట్టిన మునగ సాగు విజయవంతమైంది. రైతులు కాయలు కోయడం మొదలు పెట్టారు. వచ్చే ఏడాది మరింత పెద్ద ఎత్తున మునగ సాగు చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. రైతులకు నర్సరీల నుంచే మొక్కలు సరఫరా చేస్తాం. సన్న, చిన్న కారు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– అమర్‌నాథరెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

రూ.1.15 లక్షల ఆదాయం



ఈ చిత్రంలో మునగకాయలను చూపిస్తున్న రైతు పేరు కే. వెంకటేశ్వర్లు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి వాసి. గత ఏడాది జూన్ నెలలో ఉపాధి హామీ పథకం కింద ఒక ఎకరాలో ఈయన పీకేఎం–1 రకం మునగ సాగు చేశారు. దాదాపు 450 మొక్కలు నాటుకున్నారు. నాటిన ఐదు నెలల్లోనే కాయలు వచ్చాయి. మొదటిసారిగా వచ్చిన పంట ద్వారా రైతుకు రూ.1.15 లక్షల ఆదాయం వచ్చింది. మొదటి పంటలోనే ఆదాయం బాగా రావడంతో రైతు ఆనందం అంతా.. ఇంతా కాదు.